జీవన తత్వ గీత పుస్తకావిష్కరణ

కమాన్‌చౌరస్తా, జూలై 7 : జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ వివేకానంద హైస్కూల్‌లో వైరాగ్యం ప్రభాకర్ రచించిన 'జీవన తత్వ గీత – నిత్య చైతన్య ప్రదాత భగవద్గీత' పుస్తకాన్ని కీర్తి పురస్కార గ్రహీత గన్నమరాజు గిరిజామనోహర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యక్తిత్వ వికాసంలో పొందిన గెలుపును ఆస్వాదించే తీరును తెలియ జెప్పే మానవ హిత గ్రంథం భగవద్గీత అని, ఇది మత గ్రంథం కాదని పేర్కొన్నారు. దాస్యం సేనాధిపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉట్నూరు ఎంపీడీవో మాడుగుల మురళీధరశర్మ పుస్తక పరిచయం చేయగా, వేదభవనం ప్రిన్సిపాల్ డాక్టర్ కల కుంట్ల వరప్రసాదాచార్యులు, సమైక్య సాహితీ అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్, బొమ్మకంటి కిషన్, కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



చింతకుంటలో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల

కొత్తపల్లి, జూలై 7 : చింతకుంట గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఎల్లమ్మ బోనాల కార్యక్రమంలో కరీంనగర్ శాసనసభ్యుడు గంగుల కమలాకర్ పాల్గొన్నారు. పోచమ్మతల్లి, ఎల్లమ్మతల్లి దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో గడపాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని మొక్కులు సమర్పించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు చింతకుంటకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రూ.5లక్షల వ్యయంతో ఎస్సీ కమ్యూనిటీ భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతినాయక్, రేణికుంట రాజు, జయప్రకాశ్, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనాథాశ్రమాన్ని సందర్శించిన వివేకానంద విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, జూలై 7 : జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్ 9, 10వ తరగతి విద్యార్థులు ఆదివారం డీర్ పార్క్ సమీపంలో వెంకట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథాశ్రమాన్ని విద్యాసంస్థల చైర్మన్ సొగాని కొమురయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో గల చిన్నారులతో విద్యార్థులు కొద్దిసేపు మాట్లాడి వారి మనోభావాలు, పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు విద్యార్థులతో మాట్లాడుతూ, అన్ని సౌకర్యాలు కల్పించిన మీ తల్లిదండ్రులను గుర్తించుకుని బాగా చదువుకొని గొప్ప స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సొగాని కొమురయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, తల్లిదండ్రులు మీ కోసం తీసుకుంటున్న శ్రద్ధ, అందిస్తున్న సౌకర్యాలు అందిపుచ్చుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు.

భగవద్గీత పాఠ్యాంశాల్లో చేర్చాలని వినతి

కమాన్‌చౌరస్తా, జూలై 7: భగవద్గీతను పాఠశాల, కళాశాల స్థాయిల్లో పాఠ్యాంశంగా చేర్చాలని గీతా భక్తసమాజం ఆధ్వర్యంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు వినతి పత్రం అందజేశారు. నగరంలోని అశోక్ నగర్ మలయాళ సద్గురు గీతామందిరం మఠాధిపతి విష్ణుసేవానందగిరి స్వామి ఆధ్వర్యంలో గీతాభక్త సమాజం నేతృత్వంలో ఆదివారం వైశ్యభవన్‌లో కలశ, గణపతి పూజ, శ్రీకృష్ణుడికి అభిషేకం, అనంతరం సంపూర్ణ భగవద్గీత సహస్రగళ పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీతను పాఠ్యాంశాల్లో చేర్చాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు బండిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇక్కడ సంపూర్ణానందగిరిస్వామి, విష్ణుసేవానందగిరి స్వామి, చిదానందగిరిస్వామి, జగదీశ్వరానందగిరిస్వామితో పాటు పురాణం మహేశ్వరశర్మ, కార్యక్రమ కన్వీనర్ బండ సత్తయ్య, కో కన్వీనర్లు కామ వెంకటేశం, ఆంజనేయులు, రామేశం, రాధాకిషన్ తదితరులు ఉన్నారు.

అల్గునూర్‌లో దొంగల హల్‌చల్

తిమ్మాపూర్, జూలై 7: అలుగునూర్‌లో ఆదివారం దొంగలు హల్‌చల్ చేశారు. ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. అలుగునూర్ గ్రామానికి చెందిన సింగిరెడ్డి అనంతరెడ్డి మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో ఫంక్షన్ వెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చే సరికి ఇంటి తాళంతో పాటు ఇంట్లో ఉన్న బీరువా పగులగొట్టి ఉన్నట్లు గమనించి ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు, క్లూస్ టీం సహకారంతో ఆధారాలు సేకరించారు. ఇంట్లో ఉన్న ఐదు తులాల బంగారం, రూ.23వేల నగదు చోరీకి గురైనట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నారు. అలాగే శనివారం అర్ధరాత్రి అలుగునూర్‌లోనే ఉన్న ఎల్లమ్మ ఆలయంలోకి ఓ దొంగ చొరబడి మూడు గ్రాములు బంగారం, రూ.ఐదు వేల నగదు ఎత్తుకెళ్లాడు. ఆయా ఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మైనారిటీ అధ్యక్షుడిగా మీర్జా ఆరిఫ్ బేగ్

శంకరపట్నం, జూలై 7: కాంగ్రెస్ మైనారిటీ సెల్ మండలాధ్యక్షుడిగా కేశవపట్నం గ్రామానికి చెందిన మీర్జా ఆరిఫ్ బేగ్‌ను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ మండలాధ్యక్షుడు బసవయ్య ప్రకటించారు. ఇక్కడ నాయకులు దుర్గం తిరుపతి, బొజ్జ చంద్రమౌళి, కల్లెపల్లి రాజయ్య, అమీర్, షారూఖ్, హయన్, పూరెల్ల ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

డాక్టర్ ప్రభాకర్ రావుకు సన్మానం

ప్రభాకర్‌రావును సన్మానిస్తున్న డెయిరీ ఉద్యోగులు

హుజూరాబాద్ రూరల్, జూలై 7: వాషింగ్టన్ డిజిటల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన నాగార్జున డెయిరీ ఎండీ పుల్లూరు ప్రభాకర్‌రావును ఆదివారం పట్టణ సమీపంలోని నాగార్జున డెయిరీలో ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ, 18 ఏండ్లుగా నాణ్యతా ప్రమాణాలతో డెయిరీ రంగంలో రాణిస్తూ వందల మంది ఉద్యోగులకు పని కల్పిస్తున్నందుకు గానూ వాషింగ్టన్ డిజిటల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో డెయిరీ సీఈవో కృష్ణప్రసాద్, ఏజీఎంలు ఆకునూరి సుధాకర్, వెంకటస్వామి, మేనేజర్లు సంతోష్ కుమార్, రజినీకాంత్ రెడ్డి, డెయిరీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరక్కపోయి మూతి పెట్టి.. ఇరుక్కుపోయి

ప్లాస్టిక్ డబ్బాలో తల ఇరుక్కోవడంతో ఇబ్బంది పడుతున్న శునకం

ఆకలి తీర్చుకోవడానికి ఓ ప్లాస్టిక్ డబ్బాలో తలను దూర్చిన ఓ కుక్క.. తిరిగి ఎంత ప్రయత్నించినా బయటకు తీయలేకపోయింది. ఆహారం సంగతి దేవుడెరుగు అది ఎంత ప్రయత్నించినా డబ్బాలో ఇరుక్కున్న తలను బయటకు తీయలేక విలవిలలాడుతూ ఊరంతా కలియదిరిగింది. ఈ ఘటన ఆదివారం తాడికల్ గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన పలువురు యువకులు డబ్బాను తొలగించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పశుసంవర్ధక అధికారులు ఇరుక్కొన్న ప్లాస్టిక్ డబ్బాను తొలగించి శునకాన్ని కాపాడాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు. -శంకరపట్నం, జూలై 7

ప్రయాణ కష్టాలు తీరేదెన్నడో..

- శిథిలావస్థకు చేరుకున్న లక్ష్మీదేవిపల్లి లోలెవల్ బ్రిడ్జి
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు

గతేడాది బ్రిడ్జి పక్కన తెగిపోయిన రోడ్డు

గంగాధర, జూలై 7: మండలంలోని గంగాధర–పెగడపల్లి రహదారిలో లక్ష్మీదేవిపల్లి వద్ద ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ బ్రిడ్జిపై నుంచి ప్రతి రోజు వేలాది వాహనాలు, బస్సుల్లో ప్రజలు ప్రయాణిస్తుంటారు. ఏటా వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసిన సమయంలో వరద నీటికి బ్రిడ్జి మునిగిపోయి ఈ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయేవి. పెగడపల్లి మండలానికి వెళ్లడానికి చుట్టూ 10 కిలోమీటర్లు తిరిగి ప్రయాణించవలసి వచ్చేది. గతేడాది వర్షాకాలంలో వరద నీటితో బ్రిడ్జి పక్కన రోడ్డు కొట్టుకుపోవడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించారు. కాగా, పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జిని నిర్మించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులను మంజూరు చేసింది. గతేడాది ఆగస్టు 28న అప్పటి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించారు. కాగా, టెండర్ ప్రక్రియ కూడా పూర్తయినా విద్యుత్ శాఖ, ఆర్అండ్‌బీ అధికారుల మధ్య సమన్వయ లోపంతో పనులు ప్రారంభం కాలేదు. ఈలోగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, పనులను పట్టించుకున్న వారు లేరని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులను పూర్తి చేసి ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జి

రాజకీయ పరిపక్వత కొరవడ్డ వెలిచాల

- తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి
- ఎంఐఎం పార్టీ నగర కార్యదర్శి సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ

కలెక్టరేట్, జూలై 7 : పారాచూట్ నాయకుడిగా వచ్చి కాంగ్రెస్ నుంచి కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేసిన వెలిచాల రాజేందర్ రావుకు రాజకీయ పరిపక్వత కొరవడిందని ఎంఐఎం పార్టీ నగర కార్యదర్శి సయ్యద్ మొయిజుద్దిన్ ఖాద్రీ విమర్శించారు. కరీంనగర్ పేరు మార్చాలంటూ విలేకరుల సమావేశంలో డిమాండ్ చేయడం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. ఆదివారం నగరంలోని ఆ పార్టీ కార్యాలయం దారుసలాంలో నిర్వహించిన నగర ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావుపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ముస్లింలంతా ఏకతాటిపైకొచ్చి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిస్తే, ముస్లిం పూర్వీకుల నామధేయంతో స్థిరపడ్డ నగర పేరును మార్చాలనడం సిగ్గుచేటన్నారు. వెంటనే తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలన్నారు. ఓటమి అసహనంతో అవాకులు, చవాకులు పేలుతున్నారని విమర్శించారు. చారిత్రక నేపథ్యం కలిగిన నగరం పేరు మార్చాలని కోరడాన్ని చూస్తుంటే బీజేపీ, ఆరెస్సెస్ సిద్ధాంతాలను రాజేందర్ రావు అనుసరిస్తున్నారనే అనుమానాలు రేకెత్తుతున్నాయన్నారు. ఈ అసెంబ్లీ నుంచి రాజేందర్‌రావు తండ్రి జగపతిరావు పలు మార్లు విజయం సాధించారని గుర్తు చేశారు. ఆయన గెలుపు వెనుక ముస్లింల పాత్ర ఎంతగానో ఉందనే విషయం మరిచి, అనాలోచిత వ్యాఖ్యలు చేస్తుండడంతో జగపతిరావు ఆత్మ ఘోషిస్తుందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు, పార్టీ నగర నాయకులు, ముఖ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు

కరీంనగర్ రూరల్, జూలై 7: మండలంలోని తీగలగుట్టపల్లి నుంచి నగునూర్ శివారు వరకు, తీగలగుట్టపల్లి నుంచి కొత్తపల్లి పట్టణంలోని కొత్తపల్లి రాణీపూర్‌రోడ్డు వరకు ఆదివారం రహదారి ఆక్రమణలను తొలగించి రోడ్డును పునరుద్ధరించామని ఆర్ఐ రజినీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

పీడీఎస్ బియ్యంతో పట్టుబడిన ఆటో

రామడుగు, జూలై 7 : వెదిరలో ఆదివారం తెల్లవారుజామున వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఆటో (ఏపీ 15 వై 4580 నంబర్)ను పట్టుకున్నారు. పట్టుబడిన సుమారు 4.5 క్వింటాళ్ల బియ్యంతోపాటు ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్టు ఎస్ఐ మామిడాల సురేందర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

దళిత బంధు రెండో విడుత విడుదల చేయాలి

హుజూరాబాద్ రూరల్,జూలై 7: దళిత బంధు పథకం రెండో విడుత డబ్బులు విడుదల కోసం చొరవ తీసుకొని సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని రంగాపూర్ మాజీ సర్పంచ్, బీజేపీ సీనియర్ నాయకుడు బింగి కరుణాకర్ ఆదివారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే 563 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఎల్కతుర్తి, హుజూరాబాద్, శంకరపట్నం, మానకొండూర్ మండలాల్లో బైపాస్ రోడ్లు నిర్మించే దగ్గర తప్పనిసరిగా సర్వీస్ రోడ్డు ఉండేలా ప్రతిపాదనలు పంపాలని కోరారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ

రాంనగర్, జూలై 7: కొత్తపల్లి మండలం సీతారాంపూర్‌లో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు పుస్తెలతాడు లాక్కొని పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపూర్‌కు చెందిన జాగిరి సుభద్ర తన ఇంటి అవతలి వైపు ఉన్న మణెమ్మ ఇంటికి వెళ్లి వస్తుండగా ఫోన్ మాట్లాడుకుంటూ వెంబడించిన ఒక వ్యక్తి ఆమె మెడ నుంచి రెండున్నర తులాల పుస్తెలతాడు లాక్కొని మరో వ్యక్తి సహాయంతో ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై వెంబడించినా ఫలితం లేకపోయింది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని ఆధారాల కోసం ప్రయత్నించారు. సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు.

ఎన్‌హెచ్ ఏఐ అధికారులతో కేంద్ర సహాయ మంత్రి సమీక్ష

విద్యానగర్, జూలై 7: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 563) విస్తరణ పనుల పురోగతిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదివారం కరీంనగర్‌లోని తన కార్యాలయంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సమావేశమయ్యారు. కరీంనగర్ నుంచి వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులు ఎంత వరకు వచ్చాయి? ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారు? తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రధానికి నరేంద్రమోదీ రూపొందించిన వంద రోజుల ప్రణాళికలో కరీంనగర్ –జగిత్యాల జాతీయ రహదారి విస్తరణ పనుల అంశం ఉండడంతో సెప్టెంబర్‌లోగా టెండర్ ప్రక్రియను పూర్తి చేసుకుని పనులను ప్రారంభించే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. అంతకు ముందు కరీంనగర్ నుంచి వరంగల్ వరకు జాతీయ రహదారి విస్తరణ పనుల పురోగతిపై మంత్రి బండి సంజయ్ ఆరా తీయగా.. ఇప్పటి వరకు 68.015 కి.మీల మేర (37 శాతం) జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయ్యాయని, వచ్చే ఏడాది జూలై నాటికి పనులను పూర్తి చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు అధికారులు తెలిపారు. గట్టుదుద్దెనపల్లి, చెంజర్లలో భూ సేకరణ విషయంలో కొంత ఇబ్బంది ఏర్పడిందని తెలపగా, వెంటనే ఆయన కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితో ఫోన్‌లో మాట్లాడారు. కరీంనగర్ ఆర్డీవోను పిలిపించి భూ సేకరణ సమస్యను పరిష్కరించాలని సూచించారు. అలా కొన్ని చోట్ల సర్వీస్, స్ట్రక్చరల్ రోడ్ల ఏర్పాటుపై ప్రజల నుంచి వినతులు అందుతున్నాయని అధికారులు పేర్కొనడంతో.. ప్రజలు, రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎన్ హెచ్ ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ మాధవి, అధికారులు కృష్ణారెడ్డి, నిర్మాణ సంస్థ ప్రతినిధులు రమేశ్ త్రిపాఠి, కమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

కమాన్‌చౌరస్తా/ వీణవంక/ శంకరపట్నం/ గంగాధర, జూలై 7 : జిల్లా వ్యాప్తంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. జిల్లా కేంద్రంలోని అల్గునూర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు సిరిసిల్ల శంకర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. వీణవంక మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో, నర్సింగాపూర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఇంజం వెంకటస్వామి, నాయకులు పాల్గొన్నారు. శంకరపట్నం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కనుకుంట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి పెట్టారు. గంగాధర మండలంలోని బూరుగుపల్లి, గంగాధర, నారాయణపూర్, నాగిరెడ్డిపూర్, ఉప్పరమల్యాల, హిమ్మత్‌నగర్ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, సంబురాలు జరుపుకొన్నారు.

వీబీ ఫౌండేషన్‌కు అనాథ వృద్ధుడి అప్పగింత

కమాన్‌చౌరస్తా, జూలై 7 : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో కొన్ని రోజులుగా ఎండకు, వానకు ఇబ్బందిపడుతూ, తిండి లేక పస్తులుంటున్న అనాథ వృద్ధుడిని వాకర్స్ ఆదివారం ఉదయం వీబీ ఫౌండేషన్ (వీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమం) నిర్వాహకుడు సీపెల్లి వీరమాధవ్‌కు అప్పగించారు. కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన సదరు వృద్ధుడు నడవలేని స్థితిలో స్టేడియంలో ఉంటుండగా, అతడిని వీరమాధవ్‌కు అప్పగించినట్లు చెప్పారు. ఇక్కడ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు గుడిపాటి రమణారెడ్డి, పెంచాల కిషన్ రావు, చాడ రవీందర్ రెడ్డి, బండవరం సుమన్, దాసరి అశోక్, మునిగంటి గంగరాజు, ప్రతాప్ రెడ్డి, నాగేశ్వరరావు, వాకర్ ఉన్నారు.

వీణవంకలో ఆత్మీయ సమ్మేళనంలో 1987–88 పదో తరగతి పూర్వ విద్యార్థులు

కరీంనగర్ సైన్స్‌వింగ్ కళాశాలలో..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

కరీంనగర్ రూరల్: చామనపల్లి పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, జూలై 7 : జిల్లా కేంద్రంలోని కార్టూ నాగడ్డ ప్రభుత్వ వైజ్ఞానిక జూనియర్ కళాశాలలో 2008 –2010 విద్యాసంవత్సరం బైపీసీ తెలుగు మీడియం విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. తమకు విద్యాబోధన చేసిన అధ్యాపకులను ఆహ్వానించి సత్కరించారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో అప్పటి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంజే సుశీల్ కుమార్, ప్రస్తుత ప్రిన్సిపాల్ డీ మధుమోహన్ రావు, అధ్యాపకులు డాక్టర్ మట్టా సంపత్‌కుమార్ రెడ్డి, ఉమాపతిరాజు, హన్మాండ్లు, డాక్టర్ కే సురేందర్ రెడ్డి, రాంరెడ్డి, మనోహర్ రావు, ప్రవీణ్ కుమార్, విజయలక్ష్మి, సంగీతారాణి, అక్తర్ తాహెర్, అరుంధతి, మహేందర్, ఆంజనేయులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వీణవంక, జూలై 7: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 1987–88 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆడిపాడి సందడి చేశారు. తాము చదువుకున్న పాఠశాలకు రూ.50 వేల విలువైన వాటర్ ప్యూరిఫయర్‌ను బహుమానంగా అందజేశారు. కార్యక్రమంలో గురువులు సురేశ్, లింగారెడ్డి, ప్రస్తుత పాఠశాల హెచ్ఎం అశోక్‌రెడ్డి, పూర్వ విద్యార్థుల కో ఆర్డినేటర్ ఎస్ శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు చిట్టి, విశ్వంభర్, దాసారపు శంకర్, అప్పని కొమురయ్య, అల్లెంకి రమేశ్, పులాల రవీందర్, కొండయ్య, జంపయ్య, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్, జూలై 7: చెర్లభూత్కూర్ కాకతీయ ఉన్నత పాఠశాల 1996–97, 1997–1998 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే చామనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–1991 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్సీతో కలిసి వెంకన్నను దర్శించుకున్న వీర్ల

తిరుమలలో ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డితో కలిసి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు

రామడుగు, జూలై 7: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని ఆదివారం ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డితో కలిసి రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు దర్శించుకున్నారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు జోగినపల్లి అజిత్‌కుమార్, కూసుగంటి శ్రవణ్ తదితరులు ఉన్నారు.

పదవీ విరమణ ప్రయోజనాలు పెంచాలి

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 7 : అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పదవీ విరమణ ప్రయోజనాలు పెంచాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సంక్షేమ సంఘం ఉమ్మడిజిల్లా అధ్యక్షురాలు టి.లక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని కిసాన్‌నగర్‌లో గల ఆసంఘం జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష చెల్లించాలని, వీఆర్ఎస్ కూడా కల్పించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హామీలు అమలు చేస్తామంటూ ఎన్నికల అనంతరం మంత్రి సీతక్క కూడా ప్రకటన చేశారన్నారు. అయితే, అధికారులు మాత్రం జీవోనం.10 ప్రకారం 65 ఏళ్లు దాటిన అంగన్‌వాడీలను కేంద్రాలకు రావొద్దంటూ అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని ప్రశ్నిస్తే ప్రభుత్వమే సర్క్యులర్ జారీ చేసిందని చెబుతున్నారని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచే వరకు తమను కొనసాగించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకురాళ్లు మమత, ఆర్. ప్రసన్న, భాగ్యలక్ష్మి, నిర్మల, మంజుల, రమాదేవి, వెంకటలక్ష్మి, లలితతో పాటు పలు మండలాల నుంచి వచ్చిన టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

నగరంలో మటన్ షాపుల తనిఖీ: 11 దుకాణాలకు జరిమానా

మటన్ షాపుల్లో తనిఖీలు చేస్తున్న నగరపాలక అధికారులు

కార్పొరేషన్, జూలై 7: కరీంనగర్‌లోని మటన్ షాపులను ఆదివారం నగర పాలక సంస్థ అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని 11 షాపులను గుర్తించి జరిమానా విధించారు. స్లాటర్ హౌస్‌లో మేకలను వధించాల్సి ఉండగా, నగరంలోని అనేక మటన్ షాపులో ఆ నిబంధనలను పాటించకుండా ఇంటి వద్ద, తమ షాపుల్లోనే మేకలను వధిస్తున్నారు. దీనిపై గతంలో అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేసి, జరిమానా విధిస్తూ వస్తున్నారు. కాగా, నగరంలోని మటన్ షాపుల్లో పూర్తిస్థాయిలో తనిఖీలు చేయాలని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం చేపట్టిన తనిఖీల్లో నిబంధనలు పాటించని మానస, మల్లేశ్, మధు, ఐలయ్య, పోచయ్య, బీరన్న, మారుతి, అంజన్న, ఎండీ సమీర్, షనవాజ్, కనకయ్య షాపులక